teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

తీన్మార్ మెల్కొల్పు
చట్టం & న్యాయం లప్పై.....
తీన్మార్ తెలుగు దిన పత్రిక
తలపెట్టిన మెల్కొల్పు కార్యక్రమంలో
భాగస్వామ్యులు కావాలని అనుకునే వారు
రచనలు, కవితలు & వ్యాసాలు
-: ఈ క్రింది మెయిల్ కి పంపించగలరు :-
teenmaardesk@gmail.com

ములుగు | సంపుటి: 04 | సంచిక: 292 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | పేజీలు : 8 | మంగళవారం 28 ఏప్రిల్ 2026 | వెల : 5-00

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad







# ఆపదలో తక్షణ రక్షణ

- నగరంలో 'స్పందన' బృందాలు షురూ
- మహిళల భద్రతే ప్రధాన ధ్యేయం
- భయపడకుండా ఫిర్యాదు చేయండి: సీఎం రేవంత్
- డయల్ 100, 112కు 'స్పందన' అనుసంధానం

**హైదరాబాద్, ఏప్రిల్ 27 (తీన్మార్ న్యూస్):** ప్రజా భద్రత, అత్యవసర సమయాల్లో సత్వర స్పందనే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన 'స్పందన (తక్షణ రక్షణ)' బృందాలు అందుబాటులోకి వచ్చాయి. బంజారాహిల్స్‌లోని టీజీ ఐసీసీసీలో సోమవారం జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీటిని లాంఛనంగా ప్రారంభించారు. ఆపద సమయంలో క్షణాల్లో ఘటనాస్థలానికి చేరుకుని ప్రజలకు తక్షణ రక్షణ కల్పించడం ఈ బృందాల ముఖ్య ఉద్దేశం.

**మహిళలు నిర్భయంగా తిరిగేలా..**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. నగరంలో మహిళలు ఎలాంటి భయం లేకుండా స్వేచ్ఛగా తిరిగే వాతావరణం ఉండాలన్నారు. "మహిళల భద్రతే స్పందన టీమ్‌ల ప్రధాన ధ్యేయం. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించేలా వీటిని ప్రత్యేకంగా ఏర్పాటు చేశాం. ఏ చిన్న ఆపద వచ్చినా మహిళలు, ప్రజలు పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వెనుకాడొద్దు" అని ఆయన పిలుపునిచ్చారు. నగర పోలీసింగ్ వ్యవస్థలో ఈ 'స్పందన' బృందాలు ఒక కీలక మార్పుగా నిలుస్తాయని పోలీసు ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

**డయల్ 100, 112 తో అనుసంధానం..**

ప్రజలకు మరింత చేరువయ్యేందుకు, - మిగతా 2లో

# ఇందిరమ్మ ఇండ్లకు స్పీడప్

- కలెక్టర్లకే పూర్తి బాధ్యతలు
- మంజూరు ప్రక్రియ నిరంతరం
- ఎప్పుడు దరఖాస్తు చేసినా ఇల్లు
- సాదాబైనామాలపై ఆర్డీవోలదే తుది నిర్ణయం
- సింగిల్ డిక్లరేషన్‌తో పరిష్కారం
- హౌసింగ్, రెవెన్యూ అధికారులతో సమీక్షలో మంత్రి పొంగులేటి



**హైదరాబాద్, ఏప్రిల్ 27 (తీన్మార్ న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని మరింత వేగవంతంగా, పారదర్శకంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జిల్లా కలెక్టర్లకు మరిన్ని అధికారాలు అప్పగిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. సోమవారం హైదరాబాద్‌లోని హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల మంత్రులు, కలెక్టర్లు, అధికారులతో ఆయన లోతైన సమీక్ష నిర్వహించారు. - మిగతా 2లో



# జర్మనీలో కొలువులపై గురి

- స్కిల్స్, భాషా శిక్షణే కీలకం
- విదేశీ ఉపాధికి రాష్ట్ర యువతను సన్నద్ధం చేయాలి
- టామ్ కామ్ బోర్డు సమావేశంలో మంత్రి వివేక్ వెంకటస్వామి

**హైదరాబాద్, ఏప్రిల్ 27 (తీన్మార్ న్యూస్):** రాష్ట్రంలోని యువతకు విదేశాల్లో, ముఖ్యంగా జర్మనీలో ఉద్యోగావకాశాలు కల్పించేలా తగిన నైపుణ్యాభివృద్ధి, భాషా శిక్షణ ఇవ్వడంపై దృష్టి సారించాలని కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి అధికారులను ఆదేశించారు. యువత విదేశాల్లో విజయవంతంగా ఉద్యోగాలు సాధిస్తే, రాష్ట్రంలోని ఇతర విద్యావంతులకు కూడా విదేశీ ఉపాధిపై ఆసక్తి, స్ఫూర్తి కలుగుతుందని ఆయన ఉద్ఘాటించారు. సోమవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ (టామ్ కామ్) బోర్డు సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. శిక్షణ సామర్థ్యాలను పెంచాల్సిన అవసరాన్ని - మిగతా 2లో

# పెట్రోల్, డీజిల్ కొరత లేదు



- వదంతులు నమ్మొద్దు
- రాష్ట్రంలో 70 రోజులకు సరిపడా ఇంధన నిల్వలు
- ఆందోళన వద్దు.. బంకుల వద్ద క్యూ లైన్లు అవసరం లేదు
- పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర

2

# బీఆర్ఎస్ కమిటీలన్నీ రద్దు



- "నిఖార్సైన వారికే పగ్గాలు"
- కవిత కొత్త పార్టీపై కేటీఆర్ సెటైర్లు
- వచ్చేవి.. పోయేవి చాలా ఉంటాయి
- కవిత 'టీఆర్ఎస్'పై కేటీఆర్ కీలక వ్యాఖ్యలు
- క్షేత్రస్థాయి నుంచి బీఆర్ఎస్ ప్రక్షాళన
- ప్రజాపోరుకు పక్కా ప్రణాళిక



# క్రమశిక్షణ తప్పితే "సిట్టింగ్‌లకైనా నో టికెట్"

- గులాబీ బాస్ అల్టిమేటం
- పార్టీ ప్రక్షాళన దిశగా కేసీఆర్ అడుగులు
- నేతలకు గుబులు, కార్యకర్తలకు భరోసా

**హైదరాబాద్, ఏప్రిల్ 27 (తీన్మార్ న్యూస్):** భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అధినేత కె. చంద్రశేఖర్ రావు పార్టీ శ్రేణులకు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. పార్టీ ప్రతినిధుల సమావేశంలో పాల్గొన్న ఆయన, క్రమశిక్షణ ఉల్లంఘనలు మరియు పార్టీ అంతర్గత వ్యవహారాలపై తన మార్క్ రాజకీయ విశ్లేషణతో విరుచుకుపడ్డారు. - మిగతా 2లో

## జర్మనీలో కొలువులపై గురి

-మొదటిపేజీ తరువాయి

నొక్కిచెప్పిన మంత్రి, ముందుగా "శిక్షకులకు శిక్షణ" ఇవ్వాలని సూచించారు. ఇందుకోసం అత్యున్నత అర్హతలు కలిగిన భాషా బోధకులను వెంటనే నియమించాలని అధికారులను ఆదేశించారు. జర్మన్ భాషా శిక్షణ అత్యంత కీలకమని, భాషా నైపుణ్యాలను మెరుగుపరిచే కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలని స్పష్టం చేశారు. తెలంగాణకు చెందిన నైపుణ్యం గల కార్మికులు, విద్యావంతులైన యువతకు జర్మనీలో అపారమైన అవకాశాలు ఉన్నాయని, వారి ప్లేస్‌మెంట్స్ సజావుగా సాగేలా టామ్ కామ్ చురుగ్గా పనిచేయాలని ప్రోత్సహించారు. విదేశీ ఉద్యోగావకాశాలు కల్పించడంలో టామ్ కామ్ అత్యంత నమ్మకమైన, ప్రభుత్వ అధికారిక సంస్థ అని ఆయన పునరుద్ఘాటించారు.

గల్ఫ్ దేశాల్లో సెమీ-స్కిల్డ్ వర్కర్ల నియామకాల కోసం జరుగుతున్న ప్రయత్నాలను ఈ సందర్భంగా అధికారులు మంత్రికి వివరించారు. విదేశాల్లో పనిచేస్తున్న కార్మికుల నుంచి ఎప్పటికప్పుడు ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలని, వారికి అవసరమైన మద్దతు వ్యవస్థలు, ప్రక్రియలను మెరుగుపరిచేందుకు నివేదికలు సమర్పించాలని మంత్రి ఆదేశించారు. ప్రతి దేశానికి ప్రత్యేకమైన సంస్కృతి ఉంటుందని, అక్కడికి వెళ్లే యువతకు ఆయా దేశాల సంస్కృతి, జీవనశైలిపై కూడా శిక్షణ (కల్చరల్ ఓరియంటేషన్) ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. టామ్ కామ్ ద్వారా యువత శిక్షణ, నియామకాలకు సంబంధించి ఒక స్పష్టమైన లక్ష్యంతో (టార్గెట్ బేస్డ్) ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.

విదేశీ ఉపాధి కార్యక్రమాల్లో తెలంగాణ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవాలని, ఈ దిశగా టామ్ కామ్ తన పనితీరును మరింత మెరుగుపరుచుకోవాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్ర యువతకు ప్రపంచ స్థాయి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎల్‌ఈటీఎఫ్ సెక్రటరీ డి. హరిచందన ఐఏఎస్, లేబర్ కమిషనర్ పమేలా సత్పతి ఐఏఎస్, ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ డైరెక్టర్ నిర్మల కాంతి వెస్లీ ఐఏఎస్, ఈ. గంగాధర్‌తో పాటు టామ్ కామ్, కార్మిక శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పెట్రోల్, డీజిల్ కొరత లేదు

హైదరాబాద్, ఏప్రిల్ 27 (తీన్మార్ న్యూస్):

తెలంగాణ రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరత ఉందంటూ సోషల్ మీడియాలో విస్తృతంగా జరుగుతున్న దుష్ప్రచారాన్ని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో ఇంధన నిల్వలకు ఎటువంటి ఢోకా లేదని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం ఎంతమాత్రం లేదని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ సరఫరా నిరంతరాయంగా కొనసాగుతోందని పేర్కొన్నారు.

**70 రోజులకు సరిపడా నిల్వలు..**

ప్రస్తుతం తెలంగాణలో మరో 70 రోజులకు సరిపడా ఇంధన నిల్వలు అందుబాటులో ఉన్నాయని కమిషనర్ వెల్లడించారు. కేవలం పెట్రోల్, డీజిల్ మాత్రమే కాకుండా వంట గ్యాస్ సరఫరాలో కూడా ఎటువంటి అంతరాయం లేదని ఆయన వివరించారు. ఇంధన కొరతపై వస్తున్న తప్పుడు వార్తలను నమ్మి ప్రజలు పెట్రోల్ బంకుల వద్ద బారులు తీరవద్దని, కంగారు పడవద్దని ఆయన కోరారు. "సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాల వల్ల అనవసరంగా బంకుల వద్ద రద్దీ పెరుగుతోంది. ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నప్పుడు ఆందోళన చెందాల్సిన పనిలేదు" అని స్టీఫెన్ రవీంద్ర పేర్కొన్నారు.

**నిరంతర పర్యవేక్షణ.. సమన్వయం**

క్షేత్రస్థాయిలో పరిస్థితిని పౌరసరఫరాల శాఖ అధికారులతో పాటు, పోలీస్ మరియు రెవెన్యూ యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తోందని కమిషనర్ వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా కొరత రాకుండా ఎప్పటికప్పుడు సమీక్షలు జరుపుతున్నామని, చమురు కంపెనీలతో కూడా నిరంతరం సమన్వయం చేసుకుంటున్నామని తెలిపారు. ఏదైనా చిన్నపాటి సమస్య తలెత్తినా తక్షణమే పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రజలు సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని, కేవలం ప్రభుత్వ అధికారిక ప్రకటనలను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని ఆయన సూచించారు.



హైదరాబాద్, ఏప్రిల్ 27 (తీన్మార్ న్యూస్):

తెలంగాణ రాజకీయాల్లో కొత్త పార్టీల రాక, బీఆర్ఎస్ సంస్థాగత ప్రక్షాళనపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో ఎన్నో కొత్త పార్టీలు పుట్టుకొస్తుంటాయని, వాటి గురించి పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం జరిగిన బీఆర్ఎస్ కార్యవర్గ సమావేశం అనంతరం తీసుకున్న నిర్ణయాలను, పార్టీ భవిష్యత్ కార్యాచరణను ఆయన మీడియాకు వివరించారు.

**కవిత కొత్త పార్టీపై స్పందన..**

ఇటీవల కవిత ప్రకటించిన కొత్త పార్టీ 'తెలంగాణ రాష్ట్ర సేన' పై కేటీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "రాష్ట్రంలో ఎన్నో పార్టీలు వస్తుంటాయి.. పోతుంటాయి. వాటిని పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదు. రాజకీయాల్లో ఆవేశం కంటే ఆలోచన ముఖ్యం" అని ఆయన పరోక్షంగా సెటైర్లు వేశారు. భవిష్యత్ కార్యాచరణపై పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. కమిటీలన్నీ రద్దు.. నిఖార్సైన వారికే పగ్గాలు పార్టీని క్షేత్రస్థాయి నుంచి ప్రక్షాళన చేయడంలో భాగంగా సంచలన నిర్ణయం తీసుకున్నట్లు కేటీఆర్ వెల్లడించారు.

ఒక్క స్టేట్ (రాష్ట్ర) కమిటీ మినహా.. బూత్ స్థాయి నుంచి జిల్లా కమిటీల వరకు అన్నింటినీ తక్షణమే రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

పార్టీ కష్టకాలంలో జెండా మోస్తున్న నిఖార్సైన కార్యకర్తలను గుర్తిస్తామన్నారు.

త్వరలోనే వారందరితో నూతన, బలమైన కమిటీలను నియమించనున్నట్లు వెల్లడించారు. కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

**కాంగ్రెస్ అరాచకాలపై సమరశంఖం**

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని, దాన్ని ఆయుధంగా మలుచుకుని ప్రజాపోరాటాలు ఉధృతం చేస్తామని కేటీఆర్ హెచ్చరించారు. "కాంగ్రెస్ ప్రభుత్వంలో జరుగుతున్న అరాచకాలను క్షేత్రస్థాయిలో ఎండగడతాం. ప్రజాసమస్యల పరిష్కారం కోసం పోరాటాలను మరింత ఉధృతం చేస్తాం" అని ఆయన స్పష్టం చేశారు.

క్షేత్రస్థాయి పర్యటనలు: త్వరలోనే జిల్లాల వారీగా విస్తృత పర్యటనలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఆయా ప్రాంతాల్లో నెలకొన్న స్థానిక సమస్యలను గుర్తించి, పార్టీ తరపున పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా నిరంతరం ప్రజల పక్షాన నిలబడటమే బీఆర్ఎస్ నైజమని కేటీఆర్ పునరుద్ఘాటించారు. కార్యవర్గ సమావేశంలో పార్టీ బలోపేతానికి సంబంధించి పలు కీలక తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించినట్లు తెలిపారు.



## శవానికి అలంకరణ చేస్తే లేచిరాదు

**కవిత కొత్త పార్టీపై సీఎం సెటైర్లు**

**బీఆర్ఎస్‌కు గతం ఉంది.. భవిష్యత్తు లేదు**

**కేసీఆర్ నా రాజకీయ ప్రత్యర్థి మాత్రమే.. శత్రువు కాదు**

**సీఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు**

హైదరాబాద్, ఏప్రిల్ 27 (తీన్మార్ న్యూస్):

"కొత్త పార్టీని పక్కన పెట్టండి.. అసలు ఉన్న పార్టీ ఉంటుందో, ఊడుతుందో చూసుకోండి. బీఆర్ఎస్‌కు గతం ఉంది కానీ.. భవిష్యత్తు లేదు. బీఆర్ఎస్ పార్టీ చనిపోయిన శవంతో సమానం.." అని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. సోమవారం హైదరాబాద్‌లో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించిన ఆయన.. రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలు, మాజీ ఎమ్మెల్సీ కవిత ఏర్పాటు చేసిన కొత్త పార్టీ 'తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్)', బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు.

**శవానికి అలంకరణ చేసినట్లు..**

ప్రతి పనికి ఒక పర్పస్ ఉంటుందని, ఆ పర్పస్ అయిపోయాక దానితో పని ఉండదని సీఎం వ్యాఖ్యానించారు. కేసీఆర్ పార్టీ మనుగడ ముగిసిపోయిందని, చనిపోయిన శవానికి ఎంత అలంకరణ చేసినా మనిషి ఎలాగైతే లేచి రాడో.. బీఆర్ఎస్ పరిస్థితి కూడా అంతేనని ఎద్దేవా చేశారు. పదేళ్ల అధికారంలో అహంభావం తలకెక్కిందని, అహంకారం పెరగడంతోనే 2023లో బీఆర్ఎస్‌ను ప్రజలు ఓడగొట్టారని, ఆ తర్వాత వచ్చిన ఎన్నికల్లో 'గుండు సున్నా' ఇచ్చారని విమర్శించారు. కేసీఆర్ కుటుంబం, బీఆర్ఎస్‌తో ప్రజలకు సంబంధాలు తెగిపోయాయని స్పష్టం చేశారు.

**కుటుంబ పంచాయితీలను మాపై రుద్దకండి..**

కవిత కొత్తగా పెట్టిన పార్టీ గురించి ప్రస్తావిస్తూ.. ఇప్పుడు వాళ్లు పడే తాపత్రయం అంతా కుటుంబం కోసమేనన్నారు. "కుటుంబ పంచాయితీల్లో వచ్చిన కొత్త సంస్థలను మాపై రుద్దకండి. ఒకే చెరువు నుంచి వచ్చిన నీటికి రంగు, రుచి మారదు" అని సీఎం రేవంత్ సెటైర్లు వేశారు. ప్రస్తుతం ఎలిమినేషన్ ప్రాసెస్ నడుస్తోందన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఏం చేసినా, దాడులు చేసినా, అవమానించినా ప్రజలు భరించారని.. ఇప్పుడు కూడా అలాగే ఉంటామంటే కుదరదని హెచ్చరించారు.

**కేసీఆర్ నా రాజకీయ ప్రత్యర్థి మాత్రమే..**

కేసీఆర్ తనకు రాజకీయ ప్రత్యర్థి మాత్రమేనని, శత్రువు కాదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేసీఆర్ ఆరోగ్యం బాగాలేనప్పుడు తాను పరామర్శించానని, అసెంబ్లీకి వచ్చినప్పుడు కూడా యోగక్షేమాలు కనుక్కున్నది తానేనని గుర్తుచేశారు. "హిందూ సమాజంలో కుటుంబ పెద్ద చనిపోతే వారసులకు వారసత్వం వస్తుంది. ఔరంగజేబు వారసత్వం కోసమే అందరినీ చంపేశాడు. ఒకరు చనిపోవాలని నేను ఎందుకు కోరుకుంటా? వాళ్లు చనిపోతే ఆ పార్టీ, ఆ పార్టీ ఆస్తులు నాకు రావు కదా" అని వ్యాఖ్యానించారు.

## ఆపదలో తక్షణ రక్షణ

-మొదటిపేజీ తరువాయి

వేగంగా సేవలు అందించేందుకు ఈ స్పందన టీమ్‌లను డయల్ 100, మరియు 112 అత్యవసర టోల్ ఫ్రీ నంబర్లతో అనుసంధానం చేశారు. బాధితులు ఈ నంబర్లకు కాల్ చేసిన వెంటనే, ఆ కంట్రోల్ రూమ్ సమాచారం నేరుగా సమీపంలోని స్పందన టీమ్‌కు చేరుతుంది. తద్వారా నిమిషాల వ్యవధిలోనే పోలీసులు బాధితుల వద్దకు చేరుకుని రక్షణ కల్పిస్తారు. ఈ ప్రతిష్టాత్మక ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, దానసరి అనసూయ (సీతక్క), ఎంపీ వేం నరేందర్ రెడ్డి, డీజీపీ బి. శివధర్ రెడ్డి, నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ తదితర పోలీసు, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లకు స్పీడప్

-మొదటిపేజీ తరువాయి

ఈ పథకం అమలులో ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ, క్షేత్రస్థాయిలో సమస్యలు రాకుండా చూడటానికి ప్రతి ఉమ్మడి జిల్లాకు ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తున్నట్లు వెల్లడించారు. కలెక్టర్లు ప్రతి వారం హౌసింగ్ అధికారులతో సమీక్ష చేయాలని ఆదేశించారు.

ఇందిరమ్మ ఇండ్ల మంజూరు అనేది ఒక నిరంతర ప్రక్రియ అని, గతంలో దరఖాస్తు చేసుకోని వారు ఇప్పుడు చేసుకున్నా అర్హత ఉంటే ఇల్లు మంజూరు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఇంటి బేస్ మెంట్ నిర్మాణం పూర్తయిన తర్వాత సాంకేతిక కారణాలతో ఆగిపోయిన రూ.లక్ష బిల్లులను వెంటనే విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. ఎవరైనా ఇల్లు నిర్మించుకోలేని స్థితిలో ఉండి, వద్దనుకుంటే వారి స్థానంలో మరొక అర్హుడికి ఆ ఇల్లు కేటాయిస్తామన్నారు. పట్టణ ప్రాంతాల్లో స్థలాల కొరత ఉన్నందున 400 నుంచి 600 చదరపు అడుగులలోపు జీ ప్లస్ వన్ (+o1) పద్ధతిలో ఇళ్లు నిర్మించుకునే వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. అలాగే, గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను వెంటనే పూర్తి చేసి, తాగునీరు, కరెంటు, డ్రైనేజీ లాంటి మౌలిక వసతులు కల్పించి లబ్ధిదారులకు కేటాయించాలని అధికారులకు సూచించారు.

రెవెన్యూ వ్యవహారాలపై కూడా మంత్రి కీలక ఆదేశాలు జారీ చేశారు. సాదా బైనామాల దరఖాస్తులను వేగంగా పరిష్కరించేందుకు ఆర్డీవోలకే పూర్తి అధికారాలు దఖలు పరిచామని, కొనుగోలుదారుడు ఒక్కడే డిక్లరేషన్ ఇస్తే సరిపోతుందని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా శిథిలావస్థలో ఉన్న తహశీల్దార్ కార్యాలయాల స్థానంలో కొత్త భవనాలు, ప్రతి జిల్లా కేంద్రంలో అత్యాధునిక వసతులతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు నిర్మిస్తామన్నారు. భూసర్వేతోనే భూవివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, ప్రయోగాత్మకంగా ఐదు మండలాల్లో సర్వే మ్యాపుతో రిజిస్ట్రేషన్లు చేసి సర్వే మ్యాప్ నెంబరు, భూదార్ నెంబరు ఇస్తున్నట్లు చెప్పారు. దశాబ్దాలుగా ఉన్న రెవెన్యూ, అటవీ, దేవాదాయ, వక్ఫ్ భూముల సరిహద్దు వివాదాల పరిష్కారానికి తక్షణమే ఉమ్మడి సర్వే నిర్వహించాలన్నారు.

ఈ అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశంలో మంత్రులు దానసరి అనసూయ (సీతక్క), జూపల్లి కృష్ణారావు, జి.వివేక్, ప్రభుత్వ సలహాదారులు పి.సుదర్శన్ రెడ్డి, పోచారం శ్రీనివాస రెడ్డి, మహ్మద్ షబ్బీర్ అలీ, రెవెన్యూ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, హౌసింగ్ సెక్రటరీ వి.పి గౌతమ్ తదితరులు పాల్గొన్నారు. పేదవారి సంక్షేమం విషయంలో అధికారులు మానవతా దృక్పథంతో పనిచేయాలని మంత్రులు కోరారు.

## క్రమశిక్షణ తప్పితే "సిట్టింగ్ లకైనా నో టికెట్"

-మొదటిపేజీ తరువాయి

పార్టీ పట్ల పూర్తి నిబద్ధతతో ఉండని నేతలకు రాబోయే రోజుల్లో చోటు ఉండదని ఆయన స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో హడావిడి చేస్తూ, పార్టీని మభ్యపెట్టే ప్రయత్నాలు చేసే వారికి కేసీఆర్ గట్టి సంకేతాలు ఇచ్చారు. వాస్తవ పనితీరు ఆధారంగానే గుర్తింపు ఉంటుందని తేల్చి చెప్పారు. ?"ఆటో కాలు ఇటో కాలు వేస్తామంటే కుదరదు.. పార్టీ పట్ల పూర్తి నిబద్ధతతో ఉండాల్సిందే" అని ఇతర పార్టీల వైపు చూస్తున్న నేతలకు పరోక్షంగా హెచ్చరికలు జారీ చేశారు.

**కమిటీల ఎంపికపై కీలక ఆదేశాలు**

పార్టీ సంస్థాగత ప్రక్షాళనలో భాగంగా కమిటీల ఏర్పాటుపై కేసీఆర్ స్పష్టమైన గైడ్ లైన్స్ ఇచ్చారు. కార్యకర్తలకు పెద్దపీట: కమిటీల్లో చురుకైన కార్యకర్తలకు మాత్రమే అవకాశం ఇవ్వాలని, కేవలం నాయకులకు నచ్చిన వారికో లేదా అనుయాయులకో పోస్టులు ఇస్తే సహించేది లేదని అన్నారు.

డైరెక్ట్ కంప్లైంట్: ఎంపికలో అన్యాయం జరిగితే కార్యకర్తలు నేరుగా తనకు ఫిర్యాదు చేయవచ్చని, అటువంటి ఫిర్యాదులను స్వయంగా పరిశీలిస్తానని హామీ ఇచ్చారు.


కొత్త రక్తం: నిఖార్సైన బీఆర్ఎస్ కార్యకర్తలతో పాటు కొత్త వారికి కూడా కమిటీల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.

టికెట్ల కేటాయింపుపై క్లారిటీ

రాబోయే ఎన్నికల టికెట్ల విషయంలో కేసీఆర్ ఇప్పటి నుంచే స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. "ఎవరు సిట్టింగ్ అన్నది ముఖ్యం కాదు.. పార్టీ లైన్‌లో ఉండి, క్రమశిక్షణతో పనిచేసే వారికే ప్రాధాన్యత ఉంటుంది" అని పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధంగా వ్యవహరిస్తే సిట్టింగ్‌లకు కూడా సీట్లు ఇచ్చే ప్రసక్తే లేదని ఆయన కుండబద్దలు కొట్టారు. పార్టీని క్షేత్రస్థాయి నుంచి ప్రక్షాళన చేయడమే లక్ష్యంగా కేసీఆర్ ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. అంతర్గత విభేదాలకు స్వస్తి పలికి, రాబోయే సవాళ్లకు సిద్ధం కావాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశం పార్టీలో కొత్త ఉత్సాహాన్ని నింపడమే కాకుండా, క్రమశిక్షణ విషయంలో నాయకత్వం ఎంత కఠినంగా ఉందో స్పష్టం చేసింది.

## టిఎస్ఆర్జేసీ సెట్ హాల్ టిక్కెట్లు వచ్చేశాయ్

**మే 3న టీఎస్ఆర్జేసీ ప్రవేశ పరీక్ష**




హైదరాబాద్, ఏప్రిల్ 27 (తీన్మార్ న్యూస్):

తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ సొసైటీ నేడు, ఏప్రిల్ 27న టిఎస్ఆర్జేసీ సెట్-2026 హాల్ టిక్కెట్లను విడుదల చేసింది. ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ స్త్రతీయి.ఎ్త్రస్త్ర.స్త్రశీజ.ఱఅ నుండి తమ అడ్మిట్ కార్డులను వెంటనే డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. షెడ్యూల్ ప్రకారం ప్రవేశ పరీక్ష మే 3వ తేదీ ఆదివారం నాడు జరుగుతుంది. ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు రెండున్నర గంటల పాటు ఈ పరీక్ష కొనసాగుతుంది. మొత్తం 150 మార్కులకు ఆబ్జెక్టివ్ పద్ధతిలో ప్రశ్నపత్రం ఉంటుంది. పదో తరగతి సిలబస్ ఆధారంగానే ఈ ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు తమ వెంట హాల్ టిక్కెట్ తప్పనిసరిగా తెచ్చుకోవాలి. లేనిపక్షంలో పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు. ఎట్టి పరిస్థితుల్లోనూ డూప్లికేట్ హాల్ టిక్కెట్లు జారీ చేయబడవు. అభ్యర్థులు ముందుగానే ప్రింటౌట్ తీసుకుని సిద్ధంగా ఉంచుకోవాలి. తెలంగాణలోని ప్రధాన జిల్లా కేంద్రాలైన ఆదిలాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, నల్గొండ, మహబూబ్ నగర్, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ లలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

